- ప్రజల దీవెనలతో సీఎం కేసీఆర్ సుభిక్షమైన పాలన
- కాంగ్రెస్, బీజేపీ అసత్య ప్రచారాలు నమ్మొద్దు
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- కార్యకర్తల సమావేశంలో డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్

# మెజార్టీయే లక్ష్యంగా సమన్వయంతో పనిచేద్దాం


వెంకన్నను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

మరిపెడ, అక్టోబర్ 22 : సుభిక్షమైన పాలన అందిస్తూ రైతులు, మహిళలు, కులవృత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర ప్రజలు నిండైన ఆశీస్సులు ఉన్నాయని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం మున్సిపల్ కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఎంపీటీసీ వెంకన్నను డీసీసీబీ డైరెక్టర్ చాపల యాదగిరిరెడ్డితో కలిసి పరామర్శించారు. అనంతరం పట్టణంలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పానుగోత్ లక్పతి, గాలివారిగూడెంలో చలమల నరసింహారెడ్డి, రాంపూరం కొత్తూరులో నరసింహారెడ్డిని ఎమ్మెల్యే కలిశారు. ఆయా గ్రామాల్లో కార్యకర్తలు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీయే లక్ష్యంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో విపక్షాలకు స్థానం లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాటల గారడీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, మాజీ ఎంపీపీ గుగులోత్ వెంకన్న, పార్టీ జిల్లా నాయకులు గుగులోత్ రాంబాబు నాయక్, తేజావత్ రవీంద్రనాయక్, బొలగాని శ్రీనివాస్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు దిగజర్ల శ్రీనివాస్ ఉన్నారు.

## అన్ని వర్గాలను సమానంగా గౌరవిస్తున్న సీఎం కేసీఆర్

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 22: సీఎం కేసీఆర్ అన్ని వర్గాలను సమానంగా గౌరవిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. ఆయన నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం 'నమస్తే తెలంగాణ'తో కడియం శ్రీహరి ఫోన్‌లో మాట్లాడారు. దసరా వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. దసరా వద్ద, రహదారులపై జాగ్రత్తగా ఉండాలని, యువత వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు. ఎన్నికల కోడ్ నిబంధనలను పాటిస్తూ, సంబురాలు జరుపుకోవాలని, వచ్చే దసరాను బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పాలనలో మరింత ఉత్సాహంగా జరుపుకుంటామన్నారు.

### ఆర్థికసాయం అందజేత

జనగామ రూరల్, అక్టోబర్22: మండలంలోని చౌడారం, పెద్దపహాడ్, శామీర్‌పేట గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కాటిక పాపయ్య, పోలోజు రాములు, వక్కల సిద్దమ్మ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు వారికి ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ పరంగా వారి కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కళింగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


శక్తిస్థల్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరబాబు, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, కన్వీనర్ సోమేశ్వర్‌రావు

# దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

- రావణవధకు తొర్రూరులో రెండు వేదికలు
- ఏర్పాట్లను పరిశీలించిన నిర్వాహకులు

తొర్రూరు, అక్టోబర్ 22: దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. రావణవధకు తొర్రూరు డివిజన్ కేంద్రంలో అన్నారం రహదారిలో శక్తిస్థల్‌లో ఉత్సవ్ కల్చరల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపక కన్వీనర్ డాక్టర్ పాను గోటి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాట్లు చేపటారు. ఆదివారం అధికారులు, నిర్వాహకులు పరిశీలించారు. దసరా వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సాహభరితంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వరబాబు, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య సూచించారు. భారీ రావణ ప్రతిమలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలను ఉల్లాస పరిచేందుకు పండుగ శోభను సంతరించుకునేలా వివిధ రకాల కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొర్రూరు మున్సిపల్ కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుంచి రావణవధను వీక్షించేందుకు పెద్దఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు సూచనలు చేశారు. పటాకులు కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శక్తిస్థల్ వద్ద ఏర్పాట్ల పరిశీలనలో బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి మధుకర్‌రావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కమిషనర్ సరస్వతి, సీఐ పై సత్యనారాయణ, ఎస్సై జగదీశ్, సీనియర్ నాయకులు శామకూరి ఐలయ్య, రాజేశ్ నాయక్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు జలగం శ్రీనివాస్, గిరిజన సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడు జైసింగ్, డొంగరి శంకర్, బిజ్జాల అనిల్, గౌరీశంకర్, ఎండీ పాషా, చలవాది సత్యనారాయణ, శ్రీరాం లింగన్నగౌడ్, డొంగరి ఉపేందర్, దేవేందర్, జాటోత్ సురేశ్ ఉన్నారు. డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు స్మారక పార్క్‌లో ఉషోదయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రావణ వధ ఏర్పాట్లను డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి మధుకర్‌రావు, పట్టణ అధ్యక్షుడు బిందు శ్రీనివాస్, ఎస్సై జగదీశ్, మన్నెం రాములు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు మాదుగుల రోహిత్, బోడ భాస్కర్, పాలిశెట్టి వాసు పరిశీలించారు.

# తొర్రూరులో 'సద్దుల' సంబురం


తొర్రూరులో బతుకమ్మలతో వస్తున్న మహిళలు

తొర్రూరు, అక్టోబర్ 22: మహాలయ అమావాస్య మొదలుకొని ఆదివారం సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులు ఆనందాలు, ఆప్యాయతల నడుమ బతుకమ్మ వేడుకలు సాగాయి. చివరికి గౌరమ్మ గంగమ్మ ఒడికి చేరింది. తొర్రూరు మున్సిపల్ కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో చెరువుల వద్ద పాలకమండలి ప్రతినిధులు అధికారికంగా బతుకమ్మ వేడుకల నిర్వహణకు సౌకర్యాలను కల్పిస్తూ ఏర్పాట్లు చేసింది. గౌరీదేవిని నిష్టగా పూజించి ఆట పాటలతో కోలాటాల సందడితో చిన్నా పెద్ద తేడాలేకుండా మహిళలు గ్రామీణ జీవనం, తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా పాటలు పాడుతూ సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు నిష్టతో పూజలు చేసి ఇళ్లలో తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను ప్రతిష్ఠించి తొమ్మిది రకాల వంటకాలు( సద్దులు), సద్ది ముద్దలు నైవేద్యంగా సమర్పించారు. చెరువుల వద్ద గ్రామ పంచాయతీలు, మున్సిపల్ సిబ్బందిని ఏర్పాటు చేసి నిండు జలకళతో ఉట్టిపడుతున్న చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేయించారు. తొర్రూరు మున్సిపాలిటీలో సద్దుల బతుకమ్మ వేడుకలకు వేలాది మంది మహిళలు తరలి రావడంతో పెద్ద చెరువు పూల జాతరగా మారింది. మున్సిపల్ పాలకవర్గం ఏర్పాట్లు చేయగా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయం

గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్

డోర్నకల్, అక్టోబర్ 22: ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం ఖాయమని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఆదివారం మండలంలోని చాప్ల తండాకు చెందిన టీకాం-క్రాంతి దంపతుల కుమారుడి కూతురు పుట్టినరోజు వేడుకలకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. బీఆర్ఎస్‌కు ప్రజల మద్దతు ఉంటుందని, బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందించినట్లు పేర్కొన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్నదన్నారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు, బీఆర్ఎస్ నాయకులు మాన్యు పాట్లి, మైను పాషా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వీరన్న

## మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మున్సిపల్ చైర్మన్ వీరన్న

డోర్నకల్, అక్టోబర్ 22: మైనార్టీల అభ్యున్నతికి సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ కృషి చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఖబరస్థాన్ వద్ద ముస్లింలు ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు మద్దతుగా ఏకగ్రీవం తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రకటించిన రూ.10కోట్లలో ఖబరస్థాన్ అభివృద్ధికి రూ.50లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. ముస్లింలు కారు గుర్తుకు ఓటు వేసి రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, వార్డు కౌన్సిలర్లు పర్వీన్ సుల్తానా, పోటు జనార్ధన్, కాలా సురేందర్‌కుమార్ జైన్, బసిక అశోక్, బోరగళ్ల శరత్‌బాబు, మున్సిపల్ కోఆప్షన్ షేక్ అజిత్‌మియా, ముస్లిం నాయకులు గౌస్ పాషా, రజాలీ, వాజిత్, జావిద్, సలీం, అఖిల్, ఇబ్రహీం పాల్గొన్నారు.

## ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపు ఖాయం

పెద్దవంగర, అక్టోబర్ 22: ఎన్నికల్లో మంత్రి, పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధిక మెజార్టీతో గెలవడం ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచార రథాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో దయాకర్‌రావుపై పోటీకి రావాలంటే ప్రతిపక్షాల్లో వణుకు పుట్టిందన్నారు. నియోజకవర్గ ప్రజలు దయాకర్‌రావును ఆదరిస్తున్నారనారు. కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుధీర్‌కుమార్, లింగమూర్తి, సమ్మయ్య, వెంకన్న, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నేతలు